క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉండి: మండలంలోని 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా వెలివర్రు ఫీడర్‌కు కొత్త బ్రేకర్ వేస్తున్న కారణంగా ఈ నెల 29వ తేదీ శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎస్ వెంకటేశ్వరరావు గురువారం ఓ పత్రికలో తెలిపారు. వెలివర్రు, గరువు ప్రాంతాలకు చెందిన గృహ, ఆక్వాచెరువుల విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పుంతలో ముసలమ్మకు వెండి సమర్పణ


అమ్మవారికి వెండి సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం 24వ వార్డు రామాయణం సుబ్బన్న తోటలోని శ్రీపుంతలో ముసలమ్మ అమ్మవారికి గురువారం దాతలు 100 గ్రాముల వెండిని అందజేశారు. అమ్మవారికి సుమారు రూ.10 లక్షలతో వెండి చీర (తొడుగు) చేయించాలని సంకల్పించామని, పట్టణానికి చెందిన బోండా వాసు 100 గ్రాములు వెండి అందజేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటి సభ్యులు తెలిపారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి


కుమారిని సత్కరిస్తున్న దృశ్యం

వీరవాసరం: ఉపాధ్యాయులంతా మంచి విద్యా బోధనతో విద్యార్థులను తీర్చిదిద్దడం ద్వారా వారి మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకోవడం జరుగుతుందని ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి తెలిపారు. మండలంలోని రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. డీఎస్సీ నియామకాల్లో అభ్యర్థులకు పలు అనుమానాలు ఉన్నాయని, వాటిని పారదర్శకంగా నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. సెలక్షన్ లిస్టును బహిర్గత పరచాలని కోరారు. రాయకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆర్‌కేడీబీ కుమారి పదవి విరమణ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జు. శ్రీనివాసరావు, యుటిఎఫ్ నాయకులు దేవిరెడ్డి పుల్లారావు, ప్రసాద్ , కాయల వీరాస్వామి, విద్యా కమిటీ ఉపాధ్యాయులు , సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలి

యలమంచిలి: మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు ఎరువులు, పురుగు మందులను సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి డ్రోన్ సహాయంతో పిచికారీ చేసుకోవాలని పాలకొల్లు ప్రాంతీయ సహాయ వ్యవసాయ సంచాలకులు పలివెల మురళీకృష్ణ కోరారు. కవిటం, పోడూరు గ్రామాల్లో గురువారం వ్యవసాయ శాఖ, ఆత్మ సంయుక్తంగా వరి ఉత్పత్తిలో సాంకేతిక పరిజ్ఞానం అనే అంశంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రోన్ సహాయంతో పిచికారి చేయడం వలన సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. అదే విధంగా సిఫారసు చేసిన ఎరువులను మోతాదు వరకు మాత్రమే చల్లాలన్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడి సాధించాలని ఆయన కోరారు . ఉండి కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ మల్లిఖార్జున్ మాట్లాడుతూ పురుగు మందులు విచక్షణా రహితంగా వినియోగించరాదన్నారు. ప్రస్తుతం పైరుకు పెద్దగా పురుగులు ఏమి ఆశించలేదని రైతులు తొందరపడి పురుగు మందులు పిచికారీ చేసి ఖర్చు పెంచుకోవద్దని చెప్పారు. మండల వ్యవసాయాధికారి ఎం.వి శ్యాసరావు మాట్లాడుతూ రైతులు అందరూ పంట నమోదు చేయించుకోవాలని, పీఎంఎఫ్‌బీవై ఇన్సూరెన్ ప్రీమియం రూ. 210 కట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెట్టబత్తుల సువర్ణరాజు, సొసైటి ప్రెసిడెంట్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

యలమంచిలి: ఆచంట మండలం వల్లూరు శివారు ఎంపీ పాలెం హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులకు గురువారం పాలకొల్లు వాకర్స్ క్లబ్ తరఫున క్లబ్ అధ్యక్షులు తట్టపర్తి సుధాకర్‌రావు పాఠ్య పుస్తకాలు అందించారు. రూ. 30 వేలు విలువ చేసే కొత్త సబ్జెక్టు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే ఏకైక మార్గం చదువేనన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, సభ్యులు సోమంచి శ్రీనివాసశాస్త్రి, జవ్వాజి కళ్యాణ్, కేశిరాజు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీతోనైనా ఉపాధ్యాయుల భర్తీ పూర్తయ్యేనా?

- పండిట్ల కొరత దారుణం
- త్రైమాసిక సిలబస్ తుస్సేనా!

ఆకివీడు: ఉపాధ్యాయుల కొరతతో పలు పాఠశాలల్లో విద్యా బోధన అంతంత మాత్రంగానే ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాలలు తెరిచి మూడు నెలలు పూర్తి కావస్తున్నా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా పాఠశాలల్లో ఉపాధ్యాయుల భర్తీకి డీఎస్సీ వేగవంతం చేయడంలో విఫలమైందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల కన్నా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోనే ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. మూడు నెలల విద్యా బోధన గాలికి వదిలివేసినట్లేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఉండి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు ఉపాధ్యాయ పోస్టులు 116 ఖాళీ ఉన్నాయి.

పండిట్ల కొరత అధికం

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో లాంగ్వేజ్(పండిట్)ల కొరత అధికంగా ఉంది. పలు పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయుల కొరత ఉంది. దీంతో పాటు హిందీ ఉపాధ్యాయుల కొరత పీడిస్తుంది. మరి కొన్ని చోట్ల ఆంగ్ల ఉపాధ్యాయుల కొరత ఉంది. వీటితో పాటు ఎస్ఎస్, పీఎస్‌లు, లెక్కల సబ్జెక్టులకు ఉపాధ్యాయుల కొరత ఉంది. పలు పాఠశాల్లో వ్యాయామ ఉపాధ్యాయుల కొరత అధికంగా ఉంది.


విద్యార్థులు

సర్దుబాటు నగుబాటు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పాఠశాల్లో ఉపాధ్యాయుల ఖాళీల భర్తీకి సర్దుబాటుతో కాలక్షేపం చేసినా అది విద్యార్థులకు నగుబాటుగానే మిగిలింది. ఆయా పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు వ్యయప్రయాసలతో సర్దుబాబు విధుల్ని నిర్వహించడం వల్ల పూర్తి ప్రయోజనం లేకుండా పోయిందంటున్నారు. సర్దుబాటు కార్యక్రమం నవ్వుల పాలైందంటున్నారు.

సెప్టెంబర్ ఐదుకైనా భర్తీ పూర్తవుతాదా?

నూతన డీఎస్సీలో విజయం సాధించిన వ్యక్తులకు సెప్టెంబర్ 5న విధుల్లో జాయినింగ్ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇది ఎంతవరకూ సఫలమవుతుందో వేచి చూడాల్సిందేనని పలువురు పేర్కొంటున్నారు. భాషా పండిట్ల నియామకంతో పాటు ప్రధాన సబ్జెక్టులుగా ఉన్న సైన్సు, లెక్కలు, సోషల్ సీడీస్‌లలో ఉపాధ్యాయుల్ని భర్తీ చేయాల్సి ఉంది.

నియోజకవర్గంలో ఉపాధ్యాయుల ఖాళీలు

ఆకివీడు	56
ఉండి	10
పాలకోడేరు	07
కాళ్ల	43
మొత్తం	116

నేడు నగర పంచాయతీ సమావేశం

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ సాధారణ సమావేశం ఈ నెల 30వ తేదీ శనివారం మధ్యాహ్నం 3.30 నిమిషాలకు నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ జామి హైమావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశ అజెండాను గౌరవ సభ్యులందరికీ జారీ చేయడమైనదని, కౌన్సిల్ సభ్యులంతా సమావేశానికి హాజరుకావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

అమరవీరుల త్యాగంతో పోరాడుదాం


స్థానిక సీపీఎం ఆఫీసు వద్ద విద్యుత్ అమరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

ఆకివీడు: విద్యుత్ చార్జీల పెంపు భారాన్ని తట్టుకోలేక ఉద్యమించినవారిపై తుపాకీ వర్షం కురిపించిన పాపం వదలదని సీపీఎం ఏరియా కార్యదర్శి కె.తవిటినాయుడు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద గురువారం విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా అమరులైన వరామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామిల చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వీరోచిత పోరాట ఫలితంగానే చార్జీలను అప్పటి ప్రభుత్వం పెంచలేదన్నారు.రెండు దశాబ్దాల పాటు విద్యుత్ చార్జీల పెంపు ఊసేలేకుండా పాలన చేశారన్నారు. మళ్లీ విద్యుత్ చార్జీలను కూటమి ప్రభుత్వం నిసిగ్గుగా పెంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్‌మీటర్లు పేరుతో ఇష్టానుసారం బిల్లుల్ని పెంచుతున్నారన్నారు. విద్యుత్ భారాన్ని పెంచే ఆలోచనను విరమించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పెంకి అప్పారావు, ఎస్కే.వలీ, దోకల లక్ష్మి, బీ.కల్యాణి, బీ.రాంబాబు, రవితేజ, జీ.లావణ్య, బీ.సుబ్బారావు, పీ.కృష్ణవేణి, అచ్చయమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు

ఉండి: విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో నేటి విద్యుత్ ఉద్యమ్యానికి నాంది పలుకుతామని సీపీఎం జిల్లా నాయకుడు ధనికొండ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఉండి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం నాయకులు విద్యుత్ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ జిల్లా నాయకుడు గురుగుబెల్లి రాంబాబు, సీపీఎంనాయకుడు నిమ్మితి కిశోర్, కొట్టాడ వెంకటేశ్వరరావు, రామకూరి వెంకటరత్నం, మోపిదేవి రాము, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

నరసాపురం రూరల్: రోజురోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా వ్యవహరిస్తేనే ఈ నేరాలను అదుపు చేయగలమని ఐజీ, జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. గురువారం వార్షిక తనిఖీల్లో భాగంగా నరసాపురం రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి మిమ్మల్ని భయపెట్టినా, ఆర్థిక లావాదేవీల వివరాలు ఇవ్వాలని బెదిరించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. జాతీయ రహదారులపై ప్రయాణించేటప్పుడు నిబంధనలు పాటించాలన్నారు. నేరాలు అదుపులో ఉండేందుకు వ్యాపారులు, వివిధ సంస్థలు, గృహయజమానులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని సూచించారు. పండుగల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం అందించి రక్షణను కోరవచ్చునన్నారు. ఏలూరు రేంజ్ పరిధిలో డ్రగ్స్ పూర్తిగా నివారించామన్నారు. మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో తరచూ ప్రమాదాలు జరిగి మృత్యువాత పడుతున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారానికి బీచ్‌కు కాపలాగా శాశ్వత పెట్రోలింగ్‌ను ఏర్పాటు చేసే ఆలోచన ఉందన్నారు. తొలుత ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ నయీం అస్మీలు పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు.

అంగరంగ వైభవంగా గణనాథుడి పూజలు


ఊరూవాడా నవరాత్రుల ఉత్సవాలు

ఆకివీడు, కాళ్ల: ఊరూ వాడాల్లో అంగరంగ వైభవంగా గణనాథుడికి పూజలందుతున్నాయి. పలు చోట్ల భారీ విగ్రహాలను ప్రత్యేక పందిళ్ల క్రింద ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. స్థానికరైల్వే స్టేషన్ వద్ద భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. శాంతినగర్‌లోని వినాయక ఆలయం వద్ద, పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద, టెలిఫోన్ఎక్స్చేంజ్ వద్ద, వెలంపేట రామాలయం వద్ద చెరుకుమిల్లిలో పలు గ్రామాల్లో వినాయక చవితిని ఆనందోత్సాహాలతో నిర్వహిస్తున్నారు.


స్థానిక వెలంపేట రామాలయం వద్ద వినాయకుడికి పూజలు చేస్తున్న యువకులు,బాలల


స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహం


వీరవాసరంలో ప్రత్యేక అలంకరణలో గణనాథుడు


స్థానిక పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం


కాళ్ల: దొడ్డనపూడిలో ఏర్పాటు చేసిన 15 అడుగుల గణనాథుడు

బాల్య వివాహాలను నిషేధించాలి

భీమవరం: బాల్య వివాహాల నిషేద చట్టంపై అందరూ అవగాహన కలిగి ఉండాలని తల్లిదండ్రులు పెళ్లి వయస్సు రాకుండానే తమపిల్లలకు పెళ్లి చేయడం వల్ల అనేక ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కోవల్సి వస్తుందని భీమవరం ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి హనీష అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బాల్య వివాహాల నిషేధంపై గురువారం గునుపూడిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల విద్యార్థినుల వసతి గృహంలో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్, ప్యానల్ న్యాయవాదులు ఎస్ సుధీర్, పి అంబేడ్కర్, కె జ్యోతి, మీడియేషన్ న్యాయవాది కె విజయలక్ష్మి, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారిణి డి పుష్పరాణి, డీసీపీయూ మమతశ్రీ, గునుపూడి పీహెచ్‌సీ వైద్యుడు షారోన్ చక్రవర్తి, హాస్టల్ వార్డెన్ సీహెచ్ భానుమణి, పారా లీగల్ వాలంటీర్స్ చంద్రరావు, సత్యనారాయణరాజు, చాన్ బాషా తదితరులు పాల్గొన్నారు.


భీమవరం పట్టణం గునుపూడి బాలిక హాస్టల్లో మాట్లాడుతున్న జడ్జి హనీష

భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయం

కాళ్ల: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయ్యమయ్యాయి. ప్రధాన రహదార్లతో పాటు అంతర్గత రహదారులు వర్షపు నీటితో నిండాయి. రాష్ట్రీయ రహదారి సైతం జలమయమైంది. ప్రధానంగా సినిమా హాల్ సెంటర్, కాళ్ళ శివాలయం, కాళ్ళకూరు, జక్కరం గ్రామల పరిధిలో రాష్ట్రీయ రహదారిపై వర్షపు నీరు కాలువలను తలింపించేలా మారాయి. మండల కేంద్రమైన కాళ్ల గ్రామంలో పల్లపు వీధి వర్షపు నీటితో నిండిపోయింది. కాలువలా మారిన పల్లపు వీధిలో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో నీరు వెళ్లే మార్గం లేక వర్షపు నీరు నిలబడిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కోలనపల్లి రహదారిలో ఏర్పడ్డ భారీ గోతుల్లో వర్షం నీరు నిలబడి చెరువులను తలపించాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


కాళ్లలో జలమయమైన పల్లపు వీధి

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

భీమవరం: బాలలకు క్రీడలపై ఆసక్తి కనబర్చేలా ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బొండా రాంబాబు అన్నారు. భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూల్లో శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదం చేస్తాయన్నారు. కరాటే బ్లాక్ బెల్ట్ హోల్డర్ సుభాని మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, తల్లితండ్రులు తమ పిల్లలను చదువు, క్రీడల్లోనూ ప్రోత్సహించాలన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ విద్యార్థులకు కరాటే, రైఫిల్ షూటింగ్, జూడో, టేబుల్ టెన్నిస్ పోటీలను నిర్వహించామని విజేతలకు శుక్రవారం బహుమతులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో స్కూల్ పీఈటి రామభద్రిరాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూల్లో జాతీయ క్రీడాదినోత్సవం దృశ్యం

స్మార్ట్ మీటర్లపై ఉద్యమిస్తాం

భీమవరం అర్బన్: విద్యుత్ చార్జీల్లో ట్రూ అప్, సర్ చార్జీలను రద్దు చేయాలని లేకుంటే మరో ఉద్యమం చేపడతామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్ హెచ్చరించారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల తగ్గింపు కోసం ప్రాణ త్యాగాలు చేసిన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యుత్ పోరాటాల్లో అమరుల స్ఫూర్తితో ప్రజలపై ప్రభుత్వాలు వేస్తున్న విద్యుత్ భారాలపై పోరాటానికి సమయాత్తం అవుతున్నామన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ విద్యుత్ సంస్కరణలో భాగంగా కార్పొరేట్ సంస్థలైన ఆదానీలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు అప్పగించి ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భూపతి శామ్యేయేలు, చిలకపాటి శకుంతల బేబి, వర్ధనపు జయమ్మ, మందా విక్టోరియా, ఇంజేటి శామ్యేయేలు, మందా రాజు, నేతల మోషేను తదితరులు పాల్గొన్నారు.


వెంప గ్రామంలో విద్యుత్ అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న సీపీఎం నాయకులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఉండి: ఆస్పత్రుల్లో రోగులకు ఉత్తమ సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. గురువారం ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలు, ఓపీ రిజిస్టర్, సిబ్బంది హాజరు పరిశీలన చేశారు. అలాగే పీహెచ్‌సీలో ఉండే సిబ్బంది, ఫీల్డ్‌కు వెళ్లే సిబ్బంది ఎంతమంది ఉన్నారంటూ ఆరా తీశారు. అలాగే అన్ని రకాలు మందులు అందుబాటులో ఉన్నదీ లేనిది రిజిస్టర్‌లు పరిశీలించి తెలుసుకున్నారు. పరిశీలన అనంతరం పీహెచ్‌సీ పనితీరుపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలని, ఎక్కడా ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీలో టీబీ, హెచ్ఐవీ మందులు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. అలాగే గ్రామాల్లో ఫీవర్ సర్వే, గర్భిణుల వివరాలు, రక్తహీనత గలవారి వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. వైద్యం కొరకు వచ్చే రోగుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని ప్రతి ఒక్కరికీ ఉత్తమ వైద్య సేవలు అందించి వారి రోగాలు తగ్గించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కే నాగార్జున, డాక్టర్ పీ ఎల్ సునంద, సీహెచ్‌ఓ ఆర్ కృష్ణకుమార్, సూపర్‌వైజర్ పీ రామచంద్రరావు, బీ సువర్ణబాయ్, టీ స్పందన తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఉండి పీహెచ్‌సీ పరిశీలనలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

భీమవరం: భీమవరం పట్టణంలోని ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభ కలిగిన విద్యార్థిని విద్యార్థులకు మంతెన రామలింగరాజు, కాంతమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 95 మంది విద్యార్థులకు గురువారం రూ. 10.15 లక్షల స్కాలర్‌షిప్‌లను అందచేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి రిటైర్డ్ డీఈవో ఇందుకూరి ప్రసాదరాజు అధ్యక్షత వహించగా మంతెన రామలింగరాజు కాంతమ్మ చిత్రపటానికి భీమవరం మానవతా సంస్థ గౌరవ డైరెక్టర్ పెన్మెత్స రామ్మోహన వర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చాంబర్‌ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు కనుమూరి సత్యనారాయణరాజు, విశ్వ హిందు పరిషత్ రాష్ట్ర నాయకుడు వబిలిశెట్టి శ్రీ వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకుడు బి బలరాం, డాక్టర్ యువి రమణరాజులు మాట్లాడుతూ విద్యావ్యాప్తికి పేదల విద్యార్థులను ప్రోత్సహించడానికి రామలింగరాజు 50 ఏళ్ల క్రితమే ట్రస్ట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రామలింగరాజు మనమధ్య లేకున్నా ఆయన ఆశయసాధనకు కుమార్తె చేకూరి జాన్సీ ప్రతి ఏటా దాదాపు రూ. 10 లక్షలకు పైగా ఉపకారవేతలు అందించడంతోపాటు అనేక సామాజిక సేవాకార్యక్రమాల్లో పాల్గొనడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ సుబ్రహ్మణ్యంరాజు, బుద్ధరాజు వెంకటపతి రాజు, చింతలపాటి రామకృష్ణంరాజు, భీమాల శ్రీరామమూర్తి, కార్మూరి నర్సింహమూర్తి, గంధం శ్రీదేవి, మట్లపూడి సత్యనారాయణ, దాయన చంద్రాజీ, కలిగొట్ల గోపాల శర్మ, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.


భీమవరంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

క్వాంటం టెక్నాలజీ భవిష్యత్తులో అత్యంత కీలకం

భీమవరం: క్వాంటం టెక్నాలజీ భవిష్యత్తులో అత్యంత కీలకమైనదని సంప్రదాయ కంప్యూటర్‌తో సాధ్యం కానీ వేగవంతమైన డేటా భద్రత వంటి అంశాల్లో ప్రధాన భూమిక పోషిస్తుందని భీమవరం ఎస్ఆర్ కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణనిషాంత్‌వర్మ అన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాక్ థాన్ 2025లో భాగంగా కళాశాల స్థాయిలో జరిగే హ్యాక్ థాన్ పోటీ గురువారం కళాశాలలో ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మెడికల్, ఔషధ రంగాలతో పాటు డేటా భద్రత వంటి అంశాలలో ఈ టెక్నాలజీస్ విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ కళాశాల స్థాయిలో ఎంపికైన రెండు బృందాలు సెప్టెంబర్ 10న జరిగే గోదావరి జిల్లాల రీజనల్ సెంటర్లో జరిగే సెమీఫైనల్స్‌లో పాల్గొంటారని తెలిపారు. రీజనల్ సెంటర్ కోఆర్డినేటర్ ఎస్ గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ హ్యాక్ థాన్ విద్యార్థులలో సృజనాత్మకతను పరిశోధనాత్మక దృష్టిని పెంపొందించడంలో ఒక అద్భుత వేదికన్నారు. కళాశాలకు చెందిన 25 బృందాలలోని 150 మంది విద్యార్థులు పోటీలో పాల్గొంటున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ పి రవికిరణ్ వర్మ చెప్పారు.


హ్యాక థాన్ పోటీల్లో పాల్గొంటున్న విద్యార్థులు

మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

వీరవాసరం: వీరవాసరం మండల ప్రభుత్వ అధికారులంతా కలిసి మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీ పాక వెంకట సత్యనారాయణ తెలిపారు. వీరవాసరం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి మండల ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబచ్చి మండల అభివృద్ధికి రోల్ మోడల్‌గా నిలవాలన్నారు. వ్యవసాయ రంగం, ఆక్వా రంగం సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకోవడం జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొని పలు విషయాలపై కూలంకషంగా చర్చించారు. జిల్లా కేంద్రంగా భీమవరం కచ్చితంగా ఉంటుందని, కలెక్టరేట్ తదితర కార్యాలయాలన్నీ సంయుక్తంగా భీమవరం పరిసర ప్రాంతాల్లోనే ఉంటాయని ప్రజలెవ్వరూ కంగారు పడాల్సిన పని ఏమీ లేదని వివరించారు. మండల పరిషత్ సమావేశానికి మొట్టమొదటిసారిగా వీరవాసరం మండలం రావడంతో పాకా వెంకట సత్యనారాయణ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, భీమవరం ఏఎంసీ చైర్మన్ కలిదిండి సుజాత, ఎంపీడీవో అప్పారావు, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఆకుల లీలా కృష్ణ, వైస్ ఎంపీపీ అడ్డాల శ్రీరామ్ చంద్ర మూర్తి, ఎంపీటీసీలు ,సర్పంచులు, నీటి సంఘ అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పాక వెంకట సత్యనారాయణ